క్లుప్తంగా

విద్యార్థులకు సత్కారం



కొల్లూరు : పదో తరగతి పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు సత్కార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొల్లూరు వివేక పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 500 మార్కులకు పైబడి సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల డైరెక్టర్ రాయపాటి వీరనారాయణ, డిప్యూటీ డైరెక్టర్‌లు గుత్తా వెంకటరత్నం, రామరాజులు మెమెంటోలతో సత్కరించారు. గ్రామీణ ప్రాంతంలో నెలకొల్పిన పాఠశాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం తెలిపింది. 39 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 24 మంది విద్యార్థులు 500 మార్కులకు పైబడి సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. 589 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని అశ్వినితో పాటు, 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు.

ఓటుపై అవగాహన ర్యాలీ



కుచ్చెళ్లపాడు(వేమూరు): ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని కోరుతూ వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఆయుధం లాంటిదని దానిని అంతా సక్రమంగా వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైడ్ డ్రైన్‌లోకి దూసుకెళ్లిన బస్సు

ట్రాఫిక్‌కు అంతరాయం



కొల్లూరు : వరిగడ్డి ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు సైడ్ డ్రైన్‌లోకి దూసుకువెళ్లిన సంఘటన కొల్లూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తెనాలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో తెనాలి నుంచి తిప్పలకట్ట వెళుతోంది. స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఇరుకుగా ఉన్న రోడ్డులో ఎదురుగా వరిగడ్డి ట్రాక్టర్ వస్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సును ఖాళీ ప్రదేశంలో నిలపకుండా ముందుకు వచ్చాడు. ట్రాక్టర్‌కు సైడ్ ఇచ్చే క్రమంలో స్థానిక గృహస్తుడు రోడ్డు పక్కనున్న సైడ్ డ్రైన్‌పై పేర్చిన సిమెంట్ రాళ్లను గమనించకుండా ముందుకు పోనీయడంతో బస్సు డ్రైన్‌లో దిగబడి నిలిచిపోయింది. అసలే ఇరుకైన మార్గం కావడంతో తెనాలి-రేపల్లె మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహన దారులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కొని తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని ఇంటి, ఖాళీస్థలాల పన్నులను ఒకేసారి చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇస్తుందని, దీనిని అందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ప్రముఖ వ్యాపారి కొత్త మాసు తులసీదాసుకు సంబంధించిన ఆస్తి పన్నుల చెక్కును బుధవారం కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30లోపు ఏడాదికి సంబంధించిన పన్నులను చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి సోమశేఖర్ యాదవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ట

- పూజల్లో పాల్గొన్న ఎంపీ మోపిదేవి వెంకట రమణ
- పలు గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు



పల్లెపాలెంలో ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహం



తుమ్మలపాలెంలో ఆంజనేయ స్వామి పూజల్లో పాల్గొన్న ఎంపీ మోపిదేవి వెంకటరమణ

చెరుకుపల్లి: శ్రీ అభయాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని మండలంలోని తుమ్మలపాలెం పంచాయతీ పరిధిలోని అక్కల వెంకటరెడ్డి పాలెంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పాల్గొని అభయాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ గ్రామంలో ఆంజనేయ స్వామివారి విగ్రహం ఏర్పాటు చేసుకోవటం సంతోషదాయకం అన్నారు. విగ్రహం ఏర్పాటు చేసిన స్థానిక సర్పంచ్ చీరాల చెంచుదేవి-శివరామ కృష్ణ దంపతులతో పాటు కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, నాయకులు పైనం ఏడుకొండలరెడ్డి, పలువురు నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అంజన్న విగ్రహ ప్రతిష్ట

వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

నిజాంపట్నం: మండలంలోని అడవులదీవి పల్లెపాలెం గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పలువురు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, ఆయన సోదరుడు మోపిదేవి హరనాథబాబులు ముఖ్య అతిథులుగా పాల్గొని అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మూల మంత్ర హోమము, ప్రాయచ్చిత హోమము, జయాది హోమము, మహా పూర్ణహుతి, కుంభాభిషేకము, నేత్రదర్శనం, స్వామివారి అర్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవూరు సృజన్, ప్రసాదం వాసుదేవలు, యార్లగడ్డ మదన్ మోహన్, సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లెరూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని గంగడిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏడీ టి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

మలేరియా నిర్మూలనకు సహకరించండి

వేమూరు: మలేరియా వ్యాధి నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ పరివిన్ సూచించారు. గురువారం గ్రామంలో ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. మలేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

పొన్నూరులో ఐదు నామినేషన్లు

పొన్నూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పొన్నూరు నియోజకవర్గంలో బుధవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మీకుమారి తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా అంబటి మురళీకృష్ణ, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్. మస్తాన్‌వలి, జైభీమ్ రావ్ భారత్ పార్టీ నుంచి మొద్దు సాంబశివరావు, టీడీపీ నుంచి ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ధూళిపాళ్ల జ్యోతిర్మయి నామినేషన్లు దాఖలు చేశారు.

వైఎస్సార్ సీపీతోనే గౌడ సంక్షేమం

గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణగౌడ్



ఎమ్మెల్యే కోన రఘుపతిని సన్మానిస్తున్న శివరామకృష్ణ గౌడ్

బాపట్ల: గౌడ సామాజిక వర్గానికి వెన్నంటే ఉండి అనునిత్యం సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్సార్ సీపీకే గౌడ కులస్తులు పూర్తి మద్దతు ఉంటుందని గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. బాపట్లలోని సూర్యకాళీ ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శివరామకృష్ణగౌడ్ మాట్లాడారు. బీసీల వెన్నంటే ఉండి కార్పొరేషన్లు ఏర్పాటుచేసి చక్కటి పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే అందరం ఉన్నామని తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో గౌడ సంక్షేమ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించటంతో పాటు వారి సంక్షేమానికి కృషి చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతికి పూర్తి మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా గౌడ సంక్షేమ సంఘం నాయకులు మోర్ల సముద్రాల గౌడ్, పీటా బాబు, వేణుగోపాల్, వెంకట రమణ, కేసని రాజా, ప్రసాద్, తాతా వీర్లంకయ్య, భాస్కరరావు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు బుధవారం సాయంత్రం పార్టీ కండువాలు కప్పి వీరందరినీ సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ గెలుపుకు పని చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు వేముల శివనాగరత్న ప్రసాద్, షిండే రమేష్‌లు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ తదితరులున్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



వేమూరు ఎంపీడీవో కార్యాలయంలో రాజీనామా పత్రాలు అందజేసిన వలంటీర్లు

కర్లపాలెం: కర్లపాలెం మండలంలో బుధవారం అధిక సంఖ్యలో గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఎంపీడీవో నేతాజీ తెలిపిన వివరాల మేరకు దుండివారిపాలెం సచివాలయంలో 11 మంది, పాతనందాయపాలెం సచివాలయం పరిధిలో 5గురు, తుమ్మలపల్లి సచివాలయం పరిధిలో 4గురు వెరసి మొత్తం 20 మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేసి రాజీనామా పత్రాలను తమకు అందజేసినట్లు తెలిపారు.

వలంటీర్లు రాజీనామా

చావలి(వేమూరు): మండలంలోని చావలి గ్రామానికి చెందిన వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారని ఎంపీడీవో చంద్ర శేఖర్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు రాజీనామా పత్రాలు అందించడం జరిగిందని చెప్పారు. మండలంలో ఇప్పటివరకు 160 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు చెప్పారు.

ఫుట్‌బాల్ అండర్-14లో మెరిసిన హోలీక్రాస్ విద్యార్థులు

అత్యుత్తమ ప్రతిభతో జాతీయ జట్టుకు ఎంపిక



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

బాపట్ల: ఫుట్ బాల్ నేషనల్ అండర్-14 ఛాంపియన్ షిప్‌లో హోలీ క్రాస్ విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగిన పోటీల్లో పట్టణంలోని హోలీ క్రాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్న జి .యశ్వంత్, ఎస్.డి.సుభాని కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమలావతి, కరస్పాండెంట్స్ జెసింత, జ్యోతి విద్యార్థులను అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు అమలావతి పతకాలు సాధించిన విద్యార్థుల్ని అభినందించారు. తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందడమే కాకుండా భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయిలోనూ చక్కగా రాణించారని ప్రశంసించారు. తమ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఎస్.డి.సుభాని భారత జట్టుకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. త్వరలోనే చైనాలో అంతర్జాతీయ ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ జరగనున్న నేపథ్యంలో భారత జట్టు తరపున తమ పాఠశాల విద్యార్థి ప్రాతినిధ్యం వహించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

తెనాలిరూరల్: కొలకలూరు శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కువ మంది చదువరులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకునే విధంగా, గ్రంథాలయాన్ని ఎక్కువ మంది పాఠకులు వినియోగించుకునే విధంగా చేయాలని ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయాధికారి కడియాల సుజాతను ఆదేశించారు. ఇక్కడ అందుతున్న గ్రంథాలయ సేవల గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మే 7వ తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ

తెనాలి: గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ బుధవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. లైబ్రరీలోని పోటీ పరీక్షల పుస్తకాలతో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ రికార్డులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తంచేశారు. గ్రంథాలయ సెస్సు వసూలుకు తగిన కృషి చేయాలని ఆదేశించారు. వీరితో గ్రేడ్-1 లైబ్రేరియన్ కె.రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి హాజరు కండి



భట్టిప్రోలులో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న వరికూటి

భట్టిప్రోలు: భట్టిప్రోలు పట్టణ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం రాత్రి వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి అశోక్‌బాబు మాట్లాడారు. గురువారం జరిగే నామినేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నానీ), పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపల్లెలో 10 నామినేషన్‌లు దాఖలు

రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గంలో ఏడో రోజు పది నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెలా షారోన్ తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ తరుపున ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రెండు సెట్లు, ఆయన సోదరి అనగాని మంజుల రెండు సెట్లు నామినేషన్‌లు దాఖలు చేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మోపిదేవి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారన్నారు. జైభీమ్ భారత్ పార్టీ తరుపున దోవా రమేష్ రాంజీ, బీఎస్పీ పార్టీ తరుపున డొక్కా శ్రీనివాసరావు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా అంద్రాజు రామరాజులు ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేశారన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా మహ్మద్‌ఖాసి, బొర్రా శ్రీనివాసరావులు నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. ఎన్నికలలో పోటీ చేయ దలచిన అభ్యర్థులు ఎవరైనా ఉంటే 25వ తేదీ సాయంత్రం 3 గంటలలోపు నామినేషన్ దాఖలు చేసుకోవచ్చని తెలిపారు.

వైభవంగా గోగులాంబ వార్షిక మహోత్సవాలు

- పెదపులివర్రుకు తరలివచ్చిన భక్తజనం
- ఆకర్షణగా నిలిచిన విద్యుత్ ప్రభలు



ప్రత్యేక అలంకారంలో పెదపులివర్రు గ్రామదేవత గోగులమ్మ

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులే కాక పరిసర గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ అనంతరం అమ్మవారికి పుట్టినింటి వారి తరపున కొసరాజు రాధాకృష్ణమూర్తి, రమేష్‌బాబు దంపతులచే పసుపు, కుంకుమలు సమర్పించి సహస్ర కుంకుమార్చన శాస్త్రోక్తంగా జరిపారు. సాయంత్రం వడ్లమూడి వరప్రసాదరావుచే అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరిగింది. అనంతరం అమ్మవారిని పురవీధులలో గ్రామోత్సవం గావించారు. పూజా కార్యక్రమాలను యాజ్ఞీకులు ఆమంచి సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు దీవి రాంబాబు, దీవి గోపాల కృష్ణమాచార్యులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సజ్జా సుబ్బారావు దంపతులు అమ్మవారికి వెండి మకర తోరణం అందజేశారు. మహోత్సవాలలో విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గురువారం భక్తులు అమ్మవారికి నైవేద్యములు, మొక్కుబడులు సమర్పించుకోనున్నారు. కార్యక్రమాలను దేవాలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

26 లోపు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోండి

బాపట్ల: ఎన్నికల విధులకు నియమించబడ్డ ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడం జరిగిందని బాపట్ల అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చామకూరి శ్రీధర్ అన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం బ్యాలెట్ సదుపాయం కల్పించడం జరుగుతుందని ఎన్నికల విధులలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి ఇది వర్తింపు జరుగుతుందన్నారు. బాపట్ల నియోజకవర్గం ఎన్నికల విధులకై నియమించబడ్డ ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల సంఘం నోటిఫై చేసిన రైల్వే, బీఎస్ఎన్ఎల్, విద్యుత్, పోస్టల్, అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ, ఆరోగ్య శాఖ, ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, విమానశాఖ వంటి అత్యవసర సర్వీసులు కింద పని చేస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12, ఫారం-12డి లను ఏప్రిల్ 26 లోగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలని వివరించారు. పైన తెలిపిన ఉద్యోగులకు బాపట్ల నియోజకవర్గంలో కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా ఓటరుగా నమోదై ఉండి బాపట్ల నియోజకవర్గ పరిధిలో పనిచేస్తూ ఎన్నికల విధులు నిర్వహిస్తున్నవారు కూడా బాపట్ల అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సదరు ఫారాలను వారికి సంబంధించిన ఉద్యోగుల వివరాలతో ఏప్రిల్ 26 లోగా అందజేయాలని కోరారు.